



బండ లాగుతున్న ఎద్దులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

కేశంపేట, మార్చి 3 : కేశంపేటలోని అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. బండ లాగుడు పోటీల్లో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్, గద్వాల, కర్నూలు, హైదరాబాద్, వనపర్తి జిల్లాల పశుపోషకులు ఎడ్లను తోలుకొచ్చారు. మొదటి బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లెకు చెందిన డాక్టర్ అఖిలేష్‌రెడ్డికి రూ.లక్ష, రెండో బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా వల్యూర్‌కు చెందిన దొడ్డికాటి తిరుమలేష్ రూ.75వేలు, మూడో బహుమతి హైదరాబాద్‌కు చెందిన కిరణ్‌రెడ్డి, డాక్టర్ రోహన్ రూ.51వేలు, ఇతర బహుమతులు గద్వాల జిల్లా దేవబండకు చెందిన నితిన్‌రాయుడు, గద్వాల జిల్లా పెద్ద దగ్గడకు చెందిన గోపాలకృష్ణ, కంచిపాడుకు చెందిన కంచుపాడు వి.సుధాకర్‌రెడ్డిలు గెలుపొందారు. కార్యక్రమంలో జడ్పీటీసీ టి.విశాలశ్రావణ్ రెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, జగదీశ్వర్, యారం భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ బియ్యం భారీ స్థాయిలో పక్కదారి పడుతుండడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటోంది. పౌరసరఫరాల శాఖ, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తూ బియ్యం నిల్వ కేంద్రాలను గుర్తించి వందల క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. తాజాగా టాటానగర్-మైలార్‌దేవ్‌పల్లిలోని మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించి ఒకే రకం బియ్యాన్ని వివిధ రకాలు, బ్రాండ్లతో ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేస్తున్నట్టు గుర్తించారు. అక్రమ వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. గ్రామాలు, పట్టణాల్లో రేషన్ బియ్యం తీసుకునే వారి నుంచి అక్రమంగా సేకరించి రీపాలిష్ చేసి సన్న బియ్యం పేరుతో ప్రజలను, అక్రమ వ్యాపారంతో వాణిజ్య పన్ను ఎగ్గొడుతూ ప్రభుత్వాన్నీ మోసగిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఎక్కువ సార్లు రేషన్ బియ్యం అక్రమంగా అమ్ముతూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తున్నారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, అక్రమార్కులను జైలుకు పంపుతామని అధికారులు పేర్కొంటున్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలోని మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్‌లో బియ్యం బస్తాలను తనిఖీ చేస్తున్న ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు(ఫైల్)

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై

ఉక్కు పాదం!

తనిఖీలు ముమ్మరం చేసిన పౌరసరఫరాల శాఖ, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు

- జిల్లాలో పెద్ద మొత్తంలో పట్టుబడుతున్న రేషన్ బియ్యం
- ఒకే రకం బియ్యాన్ని వివిధ బ్రాండ్‌లతో బస్తాల్లోకి మార్చి రూ.కోట్లలో వ్యాపారం
- మైలార్‌దేవ్‌పల్లిలోని మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్‌లో అధికారుల తనిఖీలు
- 80వేల నుంచి 90వేల బస్తాలు తనిఖీ
- గజాల, తాజ్‌మహల్, తదితర బ్రాండ్లతో ప్యాకింగ్ చేస్తూ అమ్మకాలు
- ప్రభుత్వానికి వాణిజ్య పన్ను ఎగ్గొడుతున్న వ్యాపారులపై కేసు
- మిల్లర్లు, అంతర్రాష్ట్ర రవాణాపై నిఘా.. తరచూ నేరం చేస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ కేసు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 3 : రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. పౌరసరఫరాల శాఖ, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ మేరకు వారం రోజులుగా జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులను సైతం నమోదు చేస్తున్నారు. దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్‌ను నమోదు చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై గడిచిన రెండేళ్లలో 445 కేసులు నమోదయ్యాయి. రూ.2,57,23,305 విలువ గల 16,484.96 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అందులో అత్యధికంగా 2022లో 300 కేసులు నమోదు కాగా 2023 సంవత్సరంలో 145 కేసులు నమోదయ్యాయి. ఇటీవలే బండ్లగూడ, కిస్మత్‌పూర్, మైలార్‌దేవ్‌పల్లి, ఇబ్రహీంపట్నం, యాచారం, ఆమనగల్లు, యాచారం, షాద్‌నగర్ ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ దందాను గుర్తించిన నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు.

ప్రత్యేక కార్యాచరణతో సత్ఫలితాలు

టన్నులకొద్దీ రేషన్ బియ్యం సరిహద్దులు దాటి పక్కదారి పడుతోంది. దొడ్డు బియ్యం తినని తెల్ల రేషన్ కార్డుదారులు, కొందరు డీలర్ల నుంచి తక్కువ రేటుకు కొని తిరిగి పాలిష్ చేసి మార్కెట్‌లోకి తెచ్చి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం అక్రమార్కుల ఆటకట్టించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకునేందుకు నిఘాను పటిష్టం చేసింది. ఇప్పటికే బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్ సివిల్ సప్లయిస్ శాఖ గిడ్డంగుల్లో తనిఖీలు చేపట్టారు. బియ్యం నిల్వల హెచ్చుతగ్గులపై ఆరా తీశారు. గోదాంకు ఎంత స్టాక్ వచ్చింది.. రేషన్ షాపులకు ఎంత స్టాక్ పంపించారనే వివరాలు సరిగ్గా లేవని గుర్తించారు. గోదాం నిర్వాహకుడిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలోని రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఆ మిల్లులో రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి పౌల్ట్రీ ఫాంలకు రవాణా చేస్తున్నారన్న ఫిర్యాదుతో మిల్లులో తనిఖీలు చేపట్టారు. కొందరు రేషన్ బియ్యాన్ని గుట్టుగా నిల్వ చేశారనే ఫిర్యాదు రావడంతో పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు టాటానగర్-మైలార్‌దేవ్‌పల్లిలోని మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హరియానా, అయోధ్యతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది బస్తాలు దిగుమతి చేసుకున్నట్టు గమనించారు. ఒకే రకమైన బియ్యాన్ని వివిధ బ్రాండ్లుగా చేసి డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. గజాల, తాజ్‌మహల్ తదితర బ్రాండ్ల పేరుతో రేషన్ బియ్యాన్నే రీ పాలిష్ చేసి సన్న బియ్యం పేరుతో అమ్ముతున్నారు. అధికారులు 70వేల నుంచి 80వేల బస్తాలను తనిఖీ చేయగా బాస్మతి రైస్, దొడ్డు బియ్యం, సన్న బియ్యం పేర్లతో ప్యాకింగ్ చేసినట్టు నిర్ధారించారు. వివిధ ఉత్తుత్తి బ్రాండ్లతో ప్రజలను మోసం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు షెడ్లలో వేలాది బస్తాలున్నట్లు, నూకలు, మెరిగలు వేరు చేసే రెండు మిషనరీ యూనిట్లు ఉన్నాయని, వాటికి అనుమతి లేదన్నారు. అక్కడ రూ.కోట్ల వ్యాపారం జరుగుతోందని, ప్రభుత్వానికి వాణిజ్య పన్ను సైతం ఎగ్గొడుతున్నట్లు తేల్చారు. ఒకేరకం బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్లతో అమ్ముతూ ప్రజలను ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని అధికారులన్నారు. మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సంవత్సరం/నెల	నమోదైన 6ఎ కేసులు	సీజైన రేషన్ బియ్యం(క్వింటాళ్లు)	పట్టుకున్న బియ్యం విలువ(రూ)
2022 సంవత్సరంలో	300	12,106.35	1,81,03,125
2023 జనవరి	08	311.32	9,02,243
2023 ఫిబ్రవరి	10	932.23	1,16,638
2023 మార్చి	20	901.60	9,83,040
2023 ఏప్రిల్	04	353.72	12,15,208
2023 మే	29	434.48	8,04,034
2023 జూన్	15	126.90	3,01,110
2023 జూలై	10	554.95	18,43,135
2023 ఆగస్టు	15	170.84	4,75,935
2023 సెప్టెంబరు	16	169.47	5,41,359
2023 అక్టోబరు	10	60.26	1,82,514
2023 నవంబరు	03	41.84	63,304
2023 డిసెంబరు	05	321.00	1,91,660
మొత్తం	445	16,484.96	2,57,23,305

రెండేళ్లలో 445 కేసులు

జిల్లాలో 2022 సంవత్సరం, 2023లో కలిపి రెండేళ్లలో 445 రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులు నమోదయ్యాయి. వీటిలో రూ.2,57,23,305 విలువగల 16,484.96క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. 2023 మార్చి, మే, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 6ఏ కేసులు అధికంగా నమోదయ్యాయి. అధికారులు దాడులు నిర్వహిస్తూ రేషన్ బియ్యాన్ని పట్టుకుంటున్నా అక్రమార్కులు మాత్రం దందాను నిరాఘాటంగా కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యం తక్కువ ధరకు కొని రీ పాలిష్ చేసి సన్నబియ్యం పేరుతో అమ్ముతున్నారు.

రేషన్ బియ్యంతో దందా చేస్తే జైలే!



ప్రజా పంపిణీ బియ్యంతో దందా చేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతాం. తనిఖీలు ముమ్మరం చేశాం. స్క్రాప్ గోడౌన్లలో భారీగా రేషన్ బియ్యన్ని దాస్తున్నారు. రైళ్లలో కర్ణాటక, మహారాష్ట్రలకు తరలిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పరిసరాల్లో రేషన్ బియ్యం కొని నిల్వలకు కేరాఫ్ అడ్రస్‌గా టాటానగర్ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఫిబ్రవరి ప్రారంభంలోనే లారీ బియ్యాన్ని పట్టుకున్నాం. మైలార్‌దేవ్‌పల్లి పాతబస్తీ కాలనీల్లో రేషన్ బియ్యం దందా కొనసాగుతోందని తెల్సి తనిఖీలు చేస్తున్నాం. మైలార్‌దేవ్‌పల్లిలోని మూల్స్ అండ్ జగన్నాథ్ ట్రేడర్స్‌లో ఒకే రకం బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేరుతో ప్యాకింగ్ చేసి వ్యాపారం చేశారు. అక్రమ వ్యాపారం చేస్తున్న ట్రేడర్‌పై కేసు నమోదు చేశాం.

– రఘునందన్, పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ

చేవెళ్ల, మల్కాజిగిరి
ఎంపీ టికెట్లు ఎవరికి?

- మోహం చాటేస్తున్న సీనియర్లు
- బీఆర్ఎస్‌లో సస్పెన్స్‌గా మారిన లోక్‌సభ స్థానాల టికెట్ల వ్యవహారం
- చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఎన్నికల్లో పోటీపై అనిశ్చితి
- మల్కాజిగిరిలో తెరపైకి రోజుకో పేరు
- ప్రత్యామ్నాయ నేతలపై అన్వేషణ
- చేవెళ్ల పరిశీలనలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మల్కాజిగిరిలో కాసాని వీరేశ్‌లపై గురి!


ఎంపీ రంజిత్‌రెడ్డి


పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


కాసాని వీరేశ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : బీఆర్ఎస్‌లో చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీ టికెట్లు ఎవరికిస్తారనే విషయం సస్పెన్స్‌గా మారింది. ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో టికెట్లు తీసుకునేందుకు సీనియర్లు మోహం చాటేస్తున్నట్లు సమాచారం. దీంతో అధిష్ఠానానికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. వాస్తవానికి చేవెళ్లలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. కానీ.. మారిన పరిస్థితుల్లో ఆయన పోటీకి ఆసక్తి చూపడం లేదని సమాచారం. పోటీచేయాలని బీఆర్ఎస్ పెద్దలు రంజిత్‌రెడ్డిని బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. అయినా ఆయన తన నిర్ణయం మార్చుకోలేదని, పోటీ చేయనని తేల్చి చెప్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. దీంతో బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ టికెట్ విషయంలో ప్రత్యామ్నాయ పేర్లను ఆలోచిస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ భవన్‌లో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో కొప్పుల మహేశ్‌రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. పోటీకి ఆసక్తి ఉన్నవారిపై కేటీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. తమకు ఆసక్తి లేదని మాజీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ టికెట్ కోసం ఇంతకు ముందు నేతలు పోటీపడేవారు. కానీ.. ఇప్పుడు పిలిచి టికెటిస్తామన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేటీఆర్ లోక్‌సభ ఎన్నికలపై రివ్యూలు చేశారు. మొదట రివ్యూ చేసిన స్థానం చేవెళ్ల. ఎంపీ రంజిత్‌రెడ్డి మళ్లీ పోటీ చేస్తారని ప్రకటించారు. ఆయన కూడా పోటీకి సిద్ధం అయ్యారు. కానీ.. చేవెళ్లలో ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. బలమైన నేత ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి దంపతులు, అలాగే మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. చేవెళ్ల బీజేపీ టికెట్ కె.విశ్వేశ్వర్‌రెడ్డికి ఖరారైంది. రంజిత్‌రెడ్డి ఆసక్తి చూపకపోవడంతో బీఆర్ఎస్ అధిష్ఠానం మాజీ మంత్రి సబితారెడ్డి తనయుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేరు పరిశీలిస్తోంది. మల్కాజిగిరిలో పోటీకి సీనియర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. రెండు రోజుల కిందట కాసాని జ్ఞానేశ్వర్ తనయుడు వీరేశ్‌ను తెలంగాణ భవన్‌కు పిలిచి పార్టీ పెద్దలు మాట్లాడి పోటీ చేయాలని చెప్పినట్లు తెలిసింది. పోటీపై కాసాని కుటుంబం ఏ నిర్ణయం చెప్పలేదని తెలుస్తోంది.

పల్స్ పోలియో విజయవంతం

- మొదటి రోజు 95 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు
- జిల్లాలో నేడు, రేపు కొనసాగనున్న పోలియో చుక్కల కార్యక్రమం



పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు చక్కటి స్పందన లభించింది. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శశాంక ప్రారంభించారు. మూడు రోజు పాటు నిర్వహిస్తున్న చుక్కల కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 4,09,308 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి రోజు 624 కేంద్రాల ద్వారా 3.98లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇందుకు సంబంధించి 55 చొప్పున మొబైల్ టీంలు, ట్రాన్సిట్ పాయింట్లు, సమాచార విస్తరణకు వాహనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం చుక్కలు వేయించని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో చుక్కల మందు వేస్తారు. ప్రతీ ఇంటికి సీరియల్ నంబర్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ శశాంక చర్యలు తీసుకుంటున్నారు. పోలియో చుక్కల కార్యక్రమంలో 681 మంది వైద్య సిబ్బంది, 1,600 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1,385 మంది ఆశా కార్యకర్తలు, 604 మంది నర్సింగ్ కాలేజీల విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు : జిల్లా కలెక్టర్ శశాంక

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధి పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారందరికీ పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. ఆదివారం వేయించుకోలేని చిన్నారులకు మరో అవకాశంగా సోమ, మంగళవారం రెండు రోజుల పాటు పోలియో చుక్కలు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, డాక్టర్ స్వర్ణకుమారి, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, సంబంధిత డాక్టర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంతో పాటు గ్రామాల్లో ధరణి సదస్సులు నిర్వహిస్తున్నందున నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ కలెక్టర్ శశాంక తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

కుమ్మరిగూడలో ఘనంగా మల్లన్న, కేతమ్మ కల్యాణోత్సవం

షాబాద్, మార్చి 3 : మండల పరిధి కుమ్మరిగూడలో మల్లన్న కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్న ఆలయం వద్ద ఒగ్గు కళాకారులు మల్లన్న, గొల్ల కేతమ్మ కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం మహిళలు బోనాలతో ఆలయాలకు తరలారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్లలో గ్రామం మార్మోగింది. ఆలయం వద్ద అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బోనాలతో తరలుతున్న గ్రామస్థులు

రోడ్ల పనులు పూర్తయ్యేదెన్నడు?

- నెలల తరబడి కొనసాగుతున్న పనులు
- వాహనదారులు, స్థానికుల యాతన

యాచారం, మార్చి 3 : మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు జరుగుతున్న నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖలో నిధుల కొరతనా? లేక విడుదల చేయడంలో అధికారుల జాప్యమా? తెలియదు గానీ మొత్తానికి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వంలో అయినా పనుల వేగం పెరగాలని ప్రజలు ఆశిస్తున్నారు. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట-యాచారం వరకు 12కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.84.5కోట్ల నిధులు కేటాయించింది. మూడు చోట్ల కల్వర్టులు, నజ్దిక్‌సింగారం వద్ద బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. మధ్యలో కుంట కట్ట ఎత్తు తగ్గించి రోడ్డును విస్తరించాల్సి ఉంది. ఇక్కడే కాజ్‌వే నిర్మాణం కూడా చేపట్టాలి. నందివనపర్తిలో నందీశ్వరాలయం రోడ్డుకు ఆనుకొని ఉంది. ఆలయం పక్కనే ఇళ్లు ఉన్నాయి. రోడ్డును విస్తరణలో వాటిని తొలగించాల్సిందే. నందీశ్వరాలయం వద్ద విశాలమైన చౌరస్తా ఏర్పాటు చేయాల్సి ఉంది. మీర్‌ఖాన్‌పేట, నజ్దిక్‌సింగారం గ్రామాల్లో లింక్ సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. గత ప్రభుత్వం నందివనర్తి-మేడిపల్లి వరకు ఆరు కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు రూ.48కోట్లు కేటాయించింది. నందివనపర్తిలో ఇళ్లు తొలగించాల్సి ఉండడంతో రోడ్డు విస్తరణ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో రెండు చోట్ల బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ఎకరానికి రూ.50లక్షలు ఇస్తేనే భూమి ఇస్తామని రైతులు భీష్మించడంతో అంత రేటు ఇవ్వడం కుదరదని ప్రభుత్వం భూసేకరణ చేపట్టలేదు. నందివనపర్తిలో బైపాస్ రోడ్డు వేస్తారా? లేదా? అనేది దానిపై క్లారిటీ లేదు. మొగ్గుళ్లవంపు నుంచి యాచారం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు కూడా నిలిచాయి. ఈ మార్గంలో అంబేద్కర్ విగ్రహం వరకు రోడ్డు విస్తరిస్తే 20 మంది దుకాణాదారులు వీధిన పడతారు. మొగ్గుళ్లవంపు నుంచి తిరుమలేశుని గుట్ట వరకు బైపాస్ రోడ్డు వేస్తే బాగుంటుందని దుకాణాదారులంటున్నారు. మొగ్గుళ్లవంపు నుంచి బైపాస్ రోడ్డు వేసి జగ్జీవన్‌రా, అంబేద్కర్ విగ్రహాలు తొలగించకుండా రోడ్డు విస్తరణ చేయాలని నాయకులు చెబుతున్నారు.



మీర్‌ఖాన్‌పేట-నజ్దిక్‌సింగారం గ్రామాల మధ్య నిలిచిపోయిన రోడ్డు పనులు



ఏడాదిగా అసంపూర్తిగా ఉన్న కొత్తపల్లి-నాగిల్ల రోడ్డు


స్తంభాలు తొలగిస్తేనే పనులు ముమ్మరం

కందుకూరుమండలం మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఎల్టీ, 11కేవీ లైన్లను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో పాత స్తంభాల తొలగింపు, కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. నిధులు విడుదల కాగానే రోడ్డు పనులు ముమ్మరం చేస్తామని అధికారులంటున్నారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు 150 స్తంభాలు, కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. స్తంభాలు తొలగించిన తర్వాతే రోడ్డు పనులు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు నిధులు విడుదలచేసి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనదారుల ఇబ్బందులు

యాచారం మండలం కొత్తపల్లి నుంచి కిషన్‌పల్లి మీదుగా మాల్ వరకు, కొత్తపల్లి నుంచి నాగిల్ల గ్రామం వరకు రూ.8కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు నిలిచాయి. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టిపోసి చేతులు దులుపుకున్నాడు. కొత్తపల్లి నుంచి కడ్తాల మండలం నాగిల్ల వరకు రోడ్డు మరమ్మతుకు రూ.4.5కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పనులు ఏడాదిగా ముందుకుసాగడం లేదు. పనులు చేయించడంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డుకిరువైపులా మట్టి పోయడం,కంకర తేలడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. కొత్తపల్లి, కిషన్‌పల్లి మీదుగా మాల్ వరకు రూ.3.5కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొత్తపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేయించాలని కోరుతున్నారు.

పనులు వెంటనే చేయకుంటే ధర్నాకు దిగుతాం



నెలల కింద చేపట్టిన రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలి. కొత్తపల్లి నుంచి నాగిల్లకు, మాల్‌కు పోవాలంటే నరకం అనుభవిస్తున్నాం. కాంట్రాక్టర్ రోడ్డుకు రెండు వైపులా మట్టి పోయడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే వెళ్లలేని పరిస్థితి. నెల వ్యవధిలో రోడ్డు పనులు పూర్తి చేయకపోతే మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం.

– శ్రీశైలం, రైతు, కొత్తపల్లి

బైపాస్ రోడ్డు వేయకుండా పనులు చేపట్టాలి



నందీశ్వరాలయం నుంచి యాచారం వరకు రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం చేయాలి. నందివనపర్తిలో బైపాస్ రోడ్డు వేయకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. అధికారులు పనులు వెంటనే పూర్తిచేయాలి. వేసవిలో పనులు పూర్తిచేసి రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

– ఉదయశ్రీ, మాజీ సర్పంచ్, నందివనపర్తి

అసంపూర్తి రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం



కొత్తపల్లి నుంచి నాగిల్లతో పాటు మాల్ వరకు వేస్తున్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. సరిపడా నిధులున్నా రోడ్డు పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పనులు పూర్తి చేయించకపోతే ఆందోళన చేస్తాం. ఉన్నతాధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

– కె.జగన్, మాజీ ఉపసర్పంచ్, కొత్తపల్లి

త్వరలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తాం

మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. రోడ్డుకు ఆనుకొని ఉన్న స్తంభాలను తొలగించడంతో పాటు కొత్తవి ఏర్పాటు చేసి విస్తరణ పనులు వేగవంతం చేస్తాం. వేసవిలో రోడ్డు పనులు పూర్తి చేయడం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– కె.వేణుగోపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ

● కడ్తాల మండలం ముద్విన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లా రాంరెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈమేరకు కల్వకుర్తి నియోజకవర్గ సమస్యలను రాంరెడ్డి సీఎంకు వివరించినట్లు తెలిపారు.


చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఏసుమార్గం అనుసరణీయం

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మార్చి 3: ఏసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడి అన్నారు. మానవత్వం, శాంతి, కరుణతో జన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి ఏసు భగవానుడని కొనియాడారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో ఎంబీ షాలెం చర్చిలో ఆదివారం శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి నిర్వాహకుడు, ఉపాధ్యక్షులు లాసర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, క్రైస్తవ సంఘం రాష్ట్ర నాయకుడు జికె.రూపస్, ఎంబీ సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన చర్చిని సంఘం నాయకులతో కలిసి కసిరెడ్డి ప్రారంభించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాపాలన సాగిస్తుందన్నారు. ఆకుతోటపల్లి చర్చి అభివృద్ధికి ప్రభుత్వపరంగా తన వంతు సాయమందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రామ్ నాయక్, ఎంపీపీ అనితవిజయ్, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ నారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీపాతి రజిత, ప్రమోద్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, నాయకులు రాంచంద్రయ్య, శ్రీను, ఎస్తేరు, టైటాస్, క్రిష్టఫర్, బిన్ని, రాజరత్నం, బుచ్చయ్య, బాల్‌రాజ్, విజయ్‌చందర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండకముందే జననాలు

- వాతావరణ మార్పుల దుష్ప్రభావం
- బాల్యం నుంచే జబ్బుల బారిన భావితరం
- పెరిగిపోతున్న శ్వాసకోశ సమస్యలు
- మందగిస్తున్న ఎదుగుదల.. తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏటేటా భూతాపం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం పుట్టబోయే పిల్లలపై కూడా ఉంటుందని ఒక అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల ముున్ముందు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జననాలు నెలలు నిండకముందే సంభవించే ప్రమాదం ఉందని ఆ స్టడీ హెచ్చరించింది. పుట్టిన పిల్లల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనం జరిపింది. దీంట్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన 163 పరిశోధనలను విశ్లేషించారు. తద్వారా, చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి ఎటువంటి తీవ్ర వాతావరణ మార్పుల వల్ల భావితరాల ఆరోగ్యంపై ఏ రకమైన ప్రభావం ఉంటుందన్నది పరిశీలించారు. పరిశోధనకు నేతృత్వం వహించిన కోరే బ్రాడ్‌షా తాము గుర్తించిన అంశాలను వెల్లడిస్తూ.. 'పిల్లల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగా ఉంటోందని గుర్తించాం. తీవ్రమైన చలివాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాససంబంధిత సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. కరువు, అధిక వర్షాలు వంటివి చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆస్ట్రేలియాలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంఖ్య పెరిగినట్లు గుర్తించాం. పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లలో పిల్లల్లో శ్వాససంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాఫ్రికాలో చిన్నారుల మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది' అని తెలిపారు. పిల్లలపై వాతావరణ మార్పుల ప్రభావం పేద, సంపన్న దేశాలనే తేడాలనే లేకుండా అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరిన్ని దుష్ప్రభావాలు ఉంటాయని, అనేక సామాజిక, ఆర్థిక సమస్యలుగా మారుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలు బ్యాలంలోనే జబ్బుల బారినపడటంతో ఆయా దేశాలపై ఆర్థికభారం పెరుగుతుందని, కుటుంబాలపై, ఆరోగ్య సేవలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజారోగ్య అభివృద్ధి విధానాలపై దృష్టిసారించాలని, మానవ చర్యలతో సంభవిస్తున్న వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయాలని ఈ అధ్యయనం ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ స్టడీ వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

ఏపీలో జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలు అడుగుతారు
- ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు
- భవంతిలో బటన్ నొక్కితే ఓట్లు రాలవు
- జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్



అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమచేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

కదిలిన యంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఈ భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు, ఎవరెవరు ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు? ఎంత భాగం ఇందులో భూదాన భూములున్నాయి? వంటి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే నంబర్లపై విచారణ జరుపుతున్నామని, అన్ని అంశాలతో కూడిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ భూముల్లో పాగా వేసిన మరికొంత మంది పెద్దల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చిన తరువాత పెద్దలంతా అధికార అండతో ఈ భూములను సొంతం చేసుకున్నట్లు వెల్లడవుతోంది. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో.. భూదాన్ భూములను కొనుగోలు చేసిన వారంతా లోలోన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూదాన భూముల వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులు సోమవారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వట్టినాగుపల్లిలో భూమికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వివరణకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. తాను 2014లో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో 2021 వరకు ఎందుకు నమోదు కాలేదనే విషయానికి మాత్రం సమాధానం లేదు. రాజేశ్వర్‌రెడ్డితో పాటు అనేక మంది భూముల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాతే వీరందరికీ పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. విచిత్రమేమిటంటే.. 2021 జూన్ 10వ తేదీన అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 24వ తేదీన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వే నంబరు 188/1/2 పేరుతో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. ఆయనతోపాటు మిగతా వారికి పాస్‌బుక్ జారీ చేయడం వెనుక పెద్ద తతంగమే నడిపారు. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా చూపించి ధరణి ద్వారా పాస్‌బుక్‌లు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో స్థానిక తహసీల్దార్, మండల సర్వే అధికారుల నివేదిక తీసుకుంటారు. కానీ, ఇక్కడ నేరుగా ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఇచ్చిన స్కెచ్, భూదాన బోర్డు ఇచ్చిన స్కెచ్ ఆధారంగా పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు అసలు సబ్‌డివిజన్, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగినట్లు ఆధారాలు కూడా లేకపోవడం వల్లే రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌లు నిలిపివేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ 22ఏ జాబితాలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పైగా.. వీరు చూపిస్తున్న భూదాన బోర్డు స్కెచ్‌లో ఎక్కడా సంతకం గానీ, తేదీ గానీ, కనీసం స్టాంప్ గానీ లేకపోవడం గమనార్హం. ధరణి ముసుగులో జరిగిన ఈ బాగోతాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగానే బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నేను కొన్నది భూదాన భూమి కాదు: పల్లా

వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని, వాటిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అక్కడ ఉన్నది కేవలం 1.10 ఎకరాలు మాత్రమేనని, ఇది కూడా భూదాన భూమి కాదని చెప్పారు. తాను వట్టినాగులపల్లి సర్వే నంబరు 181/1/2లో భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నానని, దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుని 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచానని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా ఉన్నాయని చెప్పారు. వీటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు.

మత్తుమందు ఇచ్చి యువతిపై ఇద్దరి అత్యాచారం

- నగ్నచిత్రాలు ఉన్నాయంటూ వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ.. చెప్పినట్లు వినకపోతే వాటిని బయటపెడతామంటూ ఆ ఇద్దరూ యువతిపై వేధింపులకు దిగారు. ఈక్రమంలోనే ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఏడాది క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికే బదిలీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఎల్బీనగర్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రణవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో అతడు యువతి కళాశాల దగ్గర వెళ్లి కలిసేవాడు. గతేడాది యువతి కళాశాల వద్దకు వెళ్లిన ప్రణవ్ ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ఆమెను ఇంటికి తీసుకెళ్లకుండా హోటల్‌కు తీసుకెళ్లి.. తాగునీటిలో మత్తుమందు కలిపిచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత మరో యువకుడితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే 2 నెలల క్రితం యువతి కుటుంబం బోరబండకు మకాం మార్చారు. ఈ నేపథ్యంలోనే యువతికి ఆ ఇద్దరు మళ్లీ ఫోన్ చేశారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే నగ్నచిత్రాలు బయట పెడతామంటూ వేధింపులకు దిగారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి.. వారితో కలసి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమన్వయం కుదిరేనా?

- కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నిర్వహణ కమిటీలు కనుమరుగైనట్టేనా?
- గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ
- బ్రహ్మోత్సవాలకు గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు
- అధికారులు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జాతర విజయవంతమయ్యేనా?

కీసర, మార్చి 3 : మేడ్చల్ జిల్లా కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధికారుల మధ్య సమన్వయం కుదిరి విజయవంతమవుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో ఒక్క సమీక్ష సమావేశం తప్ప.. తదుపరి కార్యాచరణపై అధికారులకు గానీ, ఆలయ నిర్వాహకులకు గానీ ఎలాంటి స్పష్టత లేదు. గతంలో బ్రహ్మోత్సవాలకు ముందే కలెక్టరేట్‌లో, కీసరగుట్ట కల్యాణ మండపంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ప్రణాళిక రూపొందించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పనులు చకచకా జరిగాయి. ప్రస్తుతం బడ్జెట్ విషయమై శాఖాపరమైన అధికారులకు పనులు అప్పజెప్పడం కానీ, ఆదేశాలు ఇవ్వడం కానీ జరగలేదని తెలుస్తోంది.

అధికారుల కో-ఆర్డినేషన్ కమిటీ కనుమరుగైనట్టేనా?

కొన్నేళ్లుగా ఏర్పాటుచేసిన అధికారుల కో-ఆర్డినేషన్ కమిటీ ప్రస్తుతం కనుమరుగైనట్లుగా తెలుస్తోంది.



కీసరగుట్టలోని రామలింగేశ్వరాలయం

గతంలో వివిధ శాఖలకు చెందిన అధికారులను సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ దాదాపు 16 కమిటీలు ఏర్పాటుచేసే వారు. కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు, ప్రొటోకాల్, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానోత్సవం, పార్కింగ్, వైద్యం, అగ్నిమాపక శాఖ ఇలా తమ బాధ్యతలు నెరవేర్చేవారు. రెండు రోజుల్లో జాతర ప్రారంభమవుతుండగా.. ఇప్పటి వరకూ కో-ఆర్డినేషన్ కమిటీ జాడ కనిపించడం లేదు.

ప్రత్యేక నిధులు మంజూరయ్యేనా?

గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేవారు. ప్రస్తుత జాతరకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం పట్ల పలువురు కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకురావడం లేదని సమాచారం. పార్కింగ్, రోడ్ల కొరకు భూమిని చదును చేసి, నీళ్ల చల్లేందుకు, మరుగుదొడ్లు కట్టేందుకు, మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు సుముఖంగా లేరనే వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో చేసిన పనులకే ఇప్పటి వరకు బిల్లులు రాలేదని, ఇప్పుడు ఎక్కడి నుంచి నిధులు తీసుకొచ్చి పనుల చేపట్టాలని కీసరలోని ఓ కాంట్రాక్టర్ తన గోడు వెళ్లబోసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులకు కూడా నిధుల పట్ల స్పష్టత లేకపోవడంతో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ, కమిషనర్‌కు నిధులు కేటాయించాలని కొందరు వినతిపత్రాలు అందజేసినట్లు సమాచారం.

స్థానిక ప్రజాప్రతినిధులకూ గుర్తింపు కరువు!

కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. గత రెండు, మూడు సంవత్సరాలుగా స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరించి జిల్లా ఉన్నతాధికారులు ఒంటెద్దు పోకడ పోతుండటంతో జాతర ప్రాముఖ్యత సన్నగిల్లుతోంది. బ్రహ్మోత్సవాలు కేవలం అధికారులే కాదు ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, కాంట్రాక్టర్లతో సమన్వయం, దుకాణదారులు ఇవన్నీ కలిస్తేనే విజయవంతమయ్యే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల విషయంలో స్థానిక రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో, పార్టీ ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ, వారిని దూరం పెడుతుండటం, సలహాలు, సూచనలు తీసుకోకుండా సమీక్షా సమావేశాలకు పిలవకపోవడం పట్ల కూడా జాతర విజయవంతమయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే.. ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన సభ్యుడు ఎమ్మెల్యేగా ఉన్నారు. దాంతో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడిందని చెప్పుకోవచ్చు. ఆరు రోజుల పాటు కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.




కీసరగుట్టపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అప్పటి కలెక్టర్ వెంకటేశ్వర్లు(ఫైల్)
జాతర ఏర్పాట్లపై కీసరగుట్టపై పర్యటిస్తున్న అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి (ఫైల్)

కోర్టు ఆదేశాలతోనే రాముడి గుడి కట్టగలిగాం

- దేశంలో ఇంకా 40వేల ఆలయాలను నిర్మిస్తాం
- యువత శివాజీ అడుగుజాడల్లో నడవాలి
- ఛత్రపతి విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే రాజాసింగ్

యాలాల/పూడూరు/దోమ, మార్చి 3 : ఎలాంటి అలజడులు లేకుండా కోర్టు ఆదేశాలతోనే అయోధ్యలో రాముడి గుడి కట్టగలిగామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని అగ్గనూరులో ఆదివారం ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజాసింగ్ మాట్లాడారు. దేశంలో ఇంకా 40వేల ఆలయాలు నిర్మిస్తామన్నారు. యువత దైవభక్తిని కలిగి ఉండి, ప్రతీవారం ఆలయాలకు వెళ్లి పూజలు చేయాలని సూచించారు. ప్రతీఒక్కరు శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గోవులను సంరక్షించి కాపాడాలన్నారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అగ్గనూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. వివేక్ యోజన సంఘం సభ్యులు, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ సర్పంచ్ భీమయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, తాండూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరిమళ తదితరులున్నారు. అంతకుముందు రాజాసింగ్ లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో గల వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అగ్గనూర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అదే విధంగా మధురలో శ్రీకృష్ణుని ఆలయాన్ని కట్టితీరుతామని రాజాసింగ్ అన్నారు. పూడూరు మండలం కంకాల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణానికి ముఖ్యఅతిథిగా వచ్చి విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం యువకులు ఆయనను భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. గ్రామాల్లో ఎక్కడైనా లవ్ జిహాద్‌కు పాల్పడకూడదన్నారు. కాశీ, అయోధ్య, మధుర మూడే ఆలయాలు కావాలని వేడుకుంటే ఇవ్వలేదు కానీ, ఇప్పుడు అఖండ భారతంలో హిందువులు ఏకమై తమ దేవాలయాలను కాశీలో కాశీవిశ్వనాథ్ దేవాలయం, అయోధ్యలో రామమందిరం, మధురలో శ్రీకృష్ణ దేవాలయం కట్టితీరుతామన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపిస్తే హిందూ గొంతును వినిపిస్తారన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, సుధాకర్ గుప్తా, పీఏసీఎస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కిషన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరన్ బోనేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నర్సింహారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్, రవీందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పేరి రాంచందర్‌యాదవ్, యువకులు తదితరులున్నారు. యువకులు విగ్రహదాత జడ్పీటీసీ మేఘమాల ప్రభాకర్‌గుప్తాలను సన్మానించారు. విగ్రహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించినవారిని సన్మానించారు. కాగా, రాజాసింగ్ ఆదివారం రాత్రి మోత్కుర్ గ్రామ ప్రధాన గేటు వద్ద ఏర్పాటుచేసిన శివాజీ, స్వామివివేకానంద, పండగల సాయన్న విగ్రహాల ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనెటి, విగ్రహాల దాత కరణం ప్రహ్లాద్‌రావు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, శివాజీ, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పూడూరు : శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షార్ట్‌సర్క్యూట్.. ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం

- రూ.50లక్షల మేర నష్టం

తాండూరు, మార్చి 3 : షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఎలక్ట్రికల్ షాప్ దగ్ధమైంది. ఈమేరకు రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. మార్వాడీ బజార్‌లోని పర్ఫెక్ట్ ఎలక్ట్రికల్ షాపులో శనివారం రాత్రి మంటలు చెలరేగి దుకాణంలోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. తెల్లవారుజామున షాపు నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో వారు అక్కడికి చేరుకుని మంటలార్పారు. రూ.30లక్షలు విలువ గల ఎలక్ట్రికల్ సామగ్రి, రూ.20లక్షలు విలువ గల ఫర్నీచర్ దగ్ధమైనట్లు యజమాని పాషా తెలిపాడు. పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. షాపును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సాయమందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బంటారం భద్రేశ్వర్, ముజీబ్‌లు మాట్లాడుతూ బాధితుడికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఈటలను కలిసిన మేడ్చల్ జిల్లా నాయకులు

మేడ్చల్ టౌన్, మార్చి 3 : మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్‌కు టికెట్ ఖరారు కావడంతో ఆయన విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేస్తారని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మునీరాబాద్ శివార్లలోని ఈటల రాజేందర్ నివాసానికి జిల్లా బీజేపీ నాయకులు వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో బీజేపీ చరిత్ర సృష్టించనుందన్నారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలే పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఈటల రాజేందర్ లాంటి సమర్థుడైన నాయకునికి టికెట్ ఇచ్చి ఎన్నికల రంగంలో దింపటంపట్ల పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం చోటు చేసుకుందన్నారు. ఈసారి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం పార్టీ ఖాతాలో చేరటం ఖాయమని తెలిపారు. ఈటల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు జోరుగా ఇంటింటి ప్రచారం చేపడుతారని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణగౌడ్, రవీందర్‌గౌడ్, తదితరులు ఈటలను కలిసిన వారిలో ఉన్నారు.



ఈటల రాజేందర్‌తో మేడ్చల్ జిల్లా బీజేపీ నాయకులు

మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం, మార్చి 3 : ముస్లిం మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగారంలోని మదర్సాలో జరిగిన నూర్ ఉల్ ఉలోం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మదర్సా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మదర్సా ఇన్‌చార్జి మహ్మద్ గౌస్, ఉస్మాన్‌ఖాన్, బిస్మిల్లా, హాజీ ఖాన్, ఆ జం, మర్యాద రాఘవేందర్‌రెడ్డి, లింగం, పాండుయాదవ్, నయాం తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

● ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు
● అన్ని గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటు


చేవెళ్ల : పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో

చేవెళ్ల, మార్చి 3 : పోలియో రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో నిర్వహించిన పల్స్‌పోలియో కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చేవెళ్లలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చేవెళ్లలో 61 బూత్‌లలో 4,618, షాబాద్ మండలంలో 4068, శంకర్‌పల్లి మండలంలో 2753, మొయినాబాద్‌లో 6,360 మందికి, మొత్తంగా 225 పోలియో బూత్‌లో 17,799 మంది పిల్లలకు చుక్కల మందులు వేయడం జరిగిందన్నారు. 72 శాతం నమోదు అయ్యిందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష్, వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : పల్స్‌పోలియో పంపిణీ కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వారి తల్లిదండ్రులు చుక్కలు వేయించారు. అందుకోసం ఆమనగల్లు మండలం, మున్సిపాలిటీ పరిధిలో 32 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు కాటన్‌మిల్లులో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర ఆధ్వర్యంలో పల్స్ పోలీయో కార్యక్రమం ప్రారంబించి చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. ఎంపీపీ అనితవిజయ్, జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ , మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, అధికారులు చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, సూపర్ వైజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో పల్స్‌పోలియో విజయవంతమైంది. మైసిగండి ప్రభుత్వాసుపత్రి వైద్య అదికారి డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. జోగు వీరయ్య, లాయక్‌అలీ, గంప శ్రీనివాస్, చందోజీ, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆమనగల్లు : చుక్కలు వేస్తున్న పరీక్షిత్ నరేంద్ర

తలకొండపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్యతో కలిసి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ చిన్నారులకు చుక్కల మందు వేశారు. డాక్టర్ స్నేహ, లక్ష్మీనర్సింహారెడ్డి, పాల్గొన్నారు. వెల్జాల గ్రామంలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : చుక్కలు వేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ఆదివారం 95 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ధరణికుమార్ తెలిపారు. డివిజన్‌లో ఐదేళ్లలోపు పిల్లల సంఖ్య 63,204 ఉందని, 286 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేశామని చెప్పారు.

మహేశ్వరం : పిల్లల జీవితానికి పోలియో చుక్కలు ఎంతో ఉపయోగపడుతాయని మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీతఅంద్యానాయక్, తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ మధుమోహన్ అన్నారు. ఆదివారం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కందుకూరు : నిండు జీవితానికి రెండు పోలీయో చుక్కలు ఆయువులాంటివని మండల వైద్యాధికారులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ రాధికలు అన్నారు. ఆదివారం మండలంలోని 35 గ్రామపంచాయతీలతో పాటు మండల కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 12,131మంది ఉండగా, 11,558 మందికి చుక్కల మందు వేసి 95.2శాతం లక్ష్యం పూర్తిచేశామని తెలిపారు. మిగిలిన వారికి ఇంటింటికి వెళ్లి చుక్కల మందును వేయనున్నట్లు చెప్పారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడిటీచర్లు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి ప్రారంభించారు. పోలియో మహమ్మారి భారిన పడకుండా ఉండేదుకు పోలియోచుక్కలు వేయించాలన్నారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో తప్పకుండా పోలియో చుక్కలు పంపిణీ జరిగేలా వైద్యసిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పోలియో మహమ్మారిని తరిమేద్దాం

షాబాద్ : పోలియో మహమ్మారిని తరిమేద్దామని, అందుకోసం తల్లిదండ్రులు కచ్చితంగా వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, చందన్‌వెళ్లి, షాబాద్ వైద్యాధికారులు డాక్టర్ వరలక్ష్మీ, శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హైతాబాద్, చందన్‌వెళ్లి, షాబాద్ గ్రామాల్లో చిన్నారులకు పోలియో చ్కులు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఏటా పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు.

షాద్‌నగర్ : పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందిందని, గ్రామాల్లో కూడా చిన్నారులకు చుక్కల మందు వేయించేందుకు ఆసక్తి కనబర్చారని చెప్పారు.

కేశంపేట : రెండు చుక్కలు పోలియో నిర్మూలనకు ఎంతో ఉపయోగపడుతాయని కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నిఖిత చెప్పారు. మండలంలోని 4,670 మంది చిన్నారులుండగా ఆదివారం 95శాతం మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగంధన, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం, వేముల్‌నర్వలోని పోలియో కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

నందిగామ : పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. ఆదివారం చేగురలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో వైద్యులు, అంగన్‌వాడి కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.


కందుకూరు : చుక్కలు వేస్తున్న మండల వైద్యాధికారి


షాద్‌నగర్ : బస్‌స్టాండ్‌లో జడ్జి ధీరజ్‌కుమార్ కుమారుడికి చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూర్ : మున్సిపాలిటీతో పాటు, మండలంలో పల్స్ పోలియో ఆదివారం విజయవంతంగా కొనసాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుకలావణ్యదేవేందర్ యాదవ్, కమిషనర్ బాలాజీ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.మొత్తం 4931మంది చిన్నారులు ఉన్నారని, 36బూత్‌ల ద్వారా వైద్య సిబ్బంది చిన్నారులకు చుక్కలను వేశారని డాక్టర్ హరికిషన్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో కూడా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మిగతా చిన్నారులకు చుక్కలను వేస్తారని చెప్పారు.

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పల్స్‌పోలియో విజయవంతం అయింది. ఆదివారం డాక్టర్ అమితజోసఫ్ ఆధ్వర్యంలో మండలంలోని 95శాతం మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. డాక్టర్ తబుస్సమ్,సిహెచ్‌వో పద్మ సిబ్బంది పాల్గొన్నారు.

కొందుర్గు : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో విజయవంతమైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మండలంలో 5 రూట్లల్లో 29 పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేయగా, 7,744 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు, చెప్పారు. 95 శాతం పూర్తయిందన్నారు.

యాచారం : మండలంలోని 24 గ్రామాల్లో 5,810 మంది చిన్నారులకుగాను 5,606 మందికి ఆదివారం పోలియో చుక్కలు వేశామని డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. 44 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి వేసినట్లు చెప్పారు. సోమవారం కూడా తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణికుమార్ ఈ కేంద్రాన్ని పరిశీలించారు.

మాడ్గుల : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లోని చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలను వేయటం విజవంతమైనట్లు వైద్యాధికారి మోహన్ తెలిపారు. మండలంలో 2,250 మంది చిన్నారులుండగా 2,032 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం ఆవరణలో ఆలయానికి వచ్చిన చిన్నారులకు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ ఆదివారం పోలియో చుక్కలు వేశారు. చిన్నారులు పోలియో బారిన పడకుండా చూడాలని ఆయన చెప్పారు. ఆలయ సిబ్బంది, ఆశవర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కనకదుర్గ ఆలయంలో చోరీ కేసు నిందితుడి అరెస్టు

● 3 తులాల బంగారం రికవరీ


మాట్లాడుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిభట్ల, మార్చి 3 : ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరులోని కనకదుర్గ దేవాలయంలో గత నెల 26న జరిగిన చోరీ కేసును ఆదిభట్ల పోలీసులు చేదించారు. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కనకదుర్గ దేవాలయంలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు రావడంతో సీసీ టీవీ పుటేజ్‌ను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తి దేవాలయం గ్రిల్స్‌లో నుంచి కర్రతో అమ్మవారి మెడలోని మంగళసూత్రాన్ని దొంగిలించినట్లు గుర్తించామని తెలిపారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పర్యవేక్షణలో ఎస్సై బాలరాజు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్స్ రమేష్, గిరి, కానిస్టేబుళ్లు కృష్ణ, ఉపేందర్‌రెడ్డి, రవిందర్‌తో టీంను ఏర్పాటు చేసి సీసీటీవీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తును ప్రారంభించి వివిధ కోణాల్లో జరిపి నిందితుడు సంగారెడ్డి జిల్లా మునుపల్లి మండలం, బుద్దెర గ్రామానికి చెందిన వడ్డె పోసయ్య(35)గా గుర్తించి అరెస్టు చేసి అతని నుంచి చోరీకి గురైన మూడు తులాల మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అతనిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 30 కేసులు ఉన్నాయని, తప్పించుకు తిరుగుతున్నాడని చెప్పారు. ఆరు రోజుల్లో కేసును చేదించిన ఎస్సై బాలరాజు, హెడ్ కానిస్టేబుల్స్ రమేష్, గిరి, కానిస్టేబుళ్లు కృష్ణ ఉపేందర్‌రెడ్డిని ఆయన అభినందించారు.

పక్కా ప్రణాళికతో చోరీ..

నిందితుడు పోసయ్య ఇప్పటి వరకు 30 దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. ముందుగా ఎంచుకున్న దేవాలయంలో వారం రోజుల పాటు గుడికి వెళ్లి భక్తునిలా పూజలు చేస్తూ, స్థానికుడిలా కనిపించడానికి పరిసర ప్రాంతాలల్లోనే తిరుగుతుంటాడని చెప్పారు. పరిసర ప్రాంతాలను పూర్తిగా అర్థం చేసుకున్న తరువాత చోరీకి పాల్పడుతాడని అన్నారు. నిందితుడు వడ్డె పోసయ్య, కొమెర పోచయ్య, రాజు, రాజేశ్వర్ పేర్లతో వివిధ ప్రాంతాల్లో తిరుగుతాడని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


భిక్షపతి (ఫైల్)

కందుకూరు, మార్చి 3 : ఎదురుగా వస్తున్న మినీ టిప్పర్‌ను ఢీ కొట్టిన సంఘనటలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దుర్మరణం చెందిన విషాద సంఘటన ఆదివారం ఉదయం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు కందుకూరు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కందుకూరు గ్రామానికి చెందిన కొమ్మగళ్ల బిక్షపతి(45) ఆదివారం ఉదయం తన బైక్‌పై మండల కేంద్రానికి వస్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న మినీటిప్పర్‌ను అతివేగంగా ఢీ కొట్టాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మక్కుల్‌జాని తెలిపారు.

శ్రీగంధం దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

యాచారం, మార్చి 3 : శ్రీ గంధం చెట్టును నరికి దుంగలను దుండగులు ఎత్తుకెళుతుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రంగయ్యగుప్త తన పంట పొలంలో శ్రీ గంధం చెట్టు పెంచాడు. గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి శ్రీ గంధం చెట్టు నరికి దుంగలను ఎత్తుకెళ్లే క్రమంలో పక్క పొలానికి చెందిన జంగయ్య అనే రైతు గమనించి 100కు కాల్ చేశాడు. పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి గంటన్నర పాటు దుండగుల కోసం మాటు వేశారు. దుండగులు రాకపోవడంతో పోలీసులు శ్రీ గంధం దుంగలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వెళ్లిపోయాక దుండగులు మరోసారి పొలంలోకి వెళ్లి పక్క పొలంలో ఉన్న జంగయ్యపై రాళ్లతో దాడి చేశారు. అతన్ని పొలం నుంచి బయటకు పంపి మిగిలిన మరలా చెట్టును నరకడం కోసం యత్నించారు. జంగయ్య మళ్లీ 100 కాల్‌కు చేయగానే వచ్చిన పోలీసులు దుండగుల కోసం తెల్లవారు జాము వరకు వేచి చూసి, వాహనాలను తనిఖీ చేసినా ఫలితం దక్కలేదు. దుండగులు తప్పించుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

కొత్తూర్, మార్చి 3 : మండల పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రైలు కింద పడి 25సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. ఆ యువకుడు రైలు పట్టాలపై తల పెట్టడంతో గుర్తుతెలియని రైలు మీదనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతుడు బీహార్‌కు చెందినవాడయి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9848090426 నెంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల రికవరీ

ఆదిభట్ల, మార్చి 3 : చోరికి గురైన ఆరు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసిన ఆదిభట్ల పోలీసులు ఆదివారం సదరు ఫిర్యాదుదారులకు అందజేశారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం సీఈఐఆర్ అనే యాప్ ఆధారంగా 6 సెల్‌ఫోన్‌లను కనుగొని స్వాధీనం చేసుకున్నామని వాటిని బాధిత వ్యక్తులకు అప్పగించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కృష్ణయ్య, సిబ్బంది బాల్‌రాజ్, రాము, గిరి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

●నలుగురు అరెస్టు, రూ15 వేలు స్వాధీనం

ఆదిభట్ల, మార్చి 3 : కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ శివారులో కోళ్ల పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదిభట్ల ఎస్ఐ వెంకటేష్ అధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. కోళ్ల పందాలలో పాల్గొన్న తన్నీరు శివ, మీసాల ఆంజనేయులు, బచ్చలకూర జంగయ్య, బండి రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేలు, మూడు పందెం కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


కేసీఆర్‌తో సతీష్‌రెడ్డి

షాబాద్, మార్చి 3 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి ఆయనను కలిసి సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరాలని కేసీఆర్ అన్నారు. ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

ఉపాధి దిశగా యువత అడుగులు


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మార్చి 3 : చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిన ఈ రోజుల్లో యువత ఇష్టపడి స్వయం ఉపాధి పొందుతుండడం అభినందనీయమని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హార్డ్‌వేర్ షాపును ఆమె ఆదివారం ప్రారంభించారు. రైమత్ రియాజ్ ఆసిఫ్, పాండుయాదవ్, లింగం, రాజునాయక్ పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి పట్ల ఎమ్మెల్యే ఔదార్యం

మండల పరిధి పెద్దపులి నాగారం సమీపంలోగల రైస్ మిల్లురోడ్డులో ద్విచక్రవాహనం పైనుంచి కింద పడిపోయి తీవ్రగాయాలైన వ్యక్తి పట్ల ఎమ్మెల్యే సబితారెడ్డి ఔదార్యం చూపారు. తన కాన్వాయిని ఆపి గాయాలపాలైన వ్యక్తి వివరాలు తెలుసుకొని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పెంజర్లలో వైభవంగా మల్లన్న కల్యాణం

కొత్తూర్: మార్చి 3 : మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలోని మల్లన్న ఆలయంలో మల్లన్న కల్యాణం, బోనాలోత్సవాన్ని గ్రామస్థులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలు, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి మల్లన్నకు సమర్పించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు వై. అంజయ్యయాదవ్, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మల్లన్న కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, ఎంపీటీసీ బి. రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు శంకరయ్య, వన్నం బాల్‌రాజ్ పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

షాద్‌నగర్‌రూరల్ : ఉత్తర రామేశ్వరంగా పేరు పొందిన, ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం అన్ని ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఇక్కడికి వస్తారు. సోమవారం గణపతిపూజ, పుణ్యావాచకం, రుద్ర హోమం, అంకురార్పణ, ధ్వజారోహణం, మంగళవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, బుధవారం ఏకాదశి రుద్రాభిషేకం, నంది సేవా, రాత్రి అగ్ని గుండాలు, గురువారం ద్వాదశ రుద్రాభిషేకం, శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. శనివారం రుద్ర హోమం పూర్ణాహుతి, ఆదివారం రథోత్సవం జరుగుతుంది. సోమవారం శివతీర్థం ఉంటుంది.


శాంతి జెండాను ఆవిష్కరిస్తున్న బీకే. లక్ష్మి

వైభవంగా శివ జయంతి ఉత్సవాలు

షాబాద్ : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివ జయంతి ఉత్సవాలు ఆదివారం మండల కేంద్రంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకురాలు బీకె. లక్ష్మీ శాంతి జెండాను ఆవిష్కరించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరమాత్మ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. యోగా మానసిక ఒత్తిడికి గురి కాకుండా చేస్తుందన్నారు. ఆత్మ, పరమాత్మ గురించి వివరించారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్, మార్చి 3 : నందిగామ మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని అన్నారు. మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జంగా నర్సింహా పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

ఆదిభట్ల, మార్చి 3 : క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి వ్యక్తి క్రీడల్లో భాగస్వామ్యం కావాలని ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్ అన్నారు. తన తల్లి పల్లె బాలమణి స్మారకార్థం కాంగ్రెస్ నాయకుడు పల్లె రజినీకాంత్‌గౌడ్ ఆదిభట్ల కేంద్రంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ఆదిభట్ల ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్ సీజన్ 7) ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిపాల్ విజేతలకు బహుమతులను అందించారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి


సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 3 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ టికెట్ కేటాయించడం పట్ల ఆదివారం చేవెళ్ల మండల నాయకులు పట్టణ కేంద్రంలో ఆయన సమక్షంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరొరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ఎ. అనంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు శర్వలింగం, వైభవ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజెవైఎం నాయకుడు మధుకర్‌రెడ్డి, ఐటీసెల్ అధ్యక్షుడు అభిషేక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, చాకలి శ్రీనివాస్, నవీన్, జైపాల్, రవి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు, మార్చి 3: ఆమనగల్లు పట్టణాకి చెందిన బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు తల్లోజు రామకృష్ణ తండ్రి రామస్వామి ఇటీవల మృతిచెందగా ఆదివారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఆయనను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కొందుర్గు, మార్చి 3 : సికింద్రాబాద్ ప్యారడైస్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ 14 సంవత్సరాల స్పైరింగ్ విభాగంలో కొందుర్గుకు చెందిన న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థిని నహీద్ గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ రమేష్ తెలిపారు. సినీ నటుడు ఇంద్రసేన నహీద్‌కు మెడల్, సర్టిఫికేట్‌ను అందజేశారు.

చౌదరిగూడ, మార్చి 3 : మండల పరిధిలోని లచ్చంపేటలో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ టూ ఆల్, రూరల్ విభాగంలో కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు యూత్‌సభ్యులు చెప్పారు. కబడ్డీ పోటీల కరపత్రాన్ని ఆదివారం విడుదల చేశారు. వివరాలకు 9666668458, 7287054647 నంబర్లను సంప్రదించాలని చెప్పారు. గోపాల్, బాల్‌రాజ్, సురేష్, మహేందర్, శ్రీశైలం, మల్లేష్ పాల్గొన్నారు.


కందుకూరు, మార్చి 3 : పట్టుదలతో చదువుల్లో రాణించే ప్రతిభావంతులకు మంచి గుర్తింపు వస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలుకమర్రి నర్సింహా అన్నారు. మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన సయ్యద్ ఆర్షా ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో ఆమెను ఆదివారం సన్మానించారు.

కందుకూరు, మార్చి 3 : మండల పరిధి దాసర్లపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్స వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కందుకూరు సీఐ మక్కుల్‌జాని పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించడానికి కృషి చేయాలన్నారు. స్థానిక ఎంపీటీసీ ఇందిరాదేవేందర్, మాజీ సర్పంచ్ పి.బాలమణిఅశోక్, ఎంఈవో మనోహర్, వేదపండితులు రేవెళ్లి రాజుశర్మ, మాజీ ఉపసర్పంచ్ మంగాదేవిబాల్‌రాజ్, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

కడ్తాల్, మార్చి 3 : కడ్తాల మండలం చరికొండ గ్రామంలో ఆదివారం కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక పర్యావరణ బాల చైతన్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీజీఆర్ బాలచైతన్య కేంద్రం ఇన్‌చార్జి కాసాని మమత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీటీసీ పాలకుర్ల రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

షాబాద్, మార్చి 3 : నిరుద్యోగ యువత, మహిళలకు రోటరీ క్లబ్ చందానగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్య శిక్షణకు మంచి స్పందన వచ్చిందని రోటరీక్లబ్ అధ్యక్షుడు గోపిక్రిష్ణ, మాజీ అధ్యక్షుడు చేవెళ్ల స్వామి చెప్పారు. ఆదివారం చందన్‌వెళ్లిలో ఏర్పాటు చేసిన శిబిరానికి 60 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.

12న ఎమ్మార్పీఎస్ సదస్సు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల, మార్చి 3 : ఈనెల 12న చేవెళ్లలో ఎమ్మార్పీఎస్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సదస్సును నిర్వహించబోతున్నట్లు, దాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గట్టగళ్ల ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నారని చెప్పారు. అన్ని మండలాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రావుగాళ్ల బాబు, ఆనంద్, జిల్లా నాయకులు నర్సింహ, మల్లికార్జున్, భానుప్రసాద్, నాని, ప్రవీణ్, శివ, శంకర్, రాజు, ఉన్నారు.